క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కలిపి క్రీడాకారులు



ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రొద్దం: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీల్లో భాగంగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో రొద్దం మండలం కలిపి గ్రామ సచివాలయ పరిధిలోని క్రీడాకారులు ఖోఖో పురుషుల విభాగంలో అద్భుత ప్రతిభ చూపి విజేతగా నిలిచినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

పార్టీ ప్రతిష్ట దిగజారిస్తే చర్యలు

మడకశిర: నియోజకవర్గంలోని కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు పత్రికలకెక్కి పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో పార్టీకి నష్టం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించవద్దని కోరారు.

కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు



కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేసిన నాయకులు

పెనుకొండ: కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇస్తూ గుర్తింపు కార్డులు ఇవ్వడం హర్షణీయమని జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీత, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన 75 మంది కళాకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డులను అందజేశారు.

ఎంపీడీఓకు సన్మానం

పరిగి: మండలంలో రెండేళ్లుగా ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన సరస్వతి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓను సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీపీ సవిత ప్రభాకర్, ఎంఈఓ శేషాచలం, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక తహసీల్దార్‌గా పని చేస్తున్న హసీనాసుల్తానా, ఎంపీడీఓగా పని చేస్తున్న కల్లుమడి ఆజాద్ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయా కార్యాలయల సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



రొళ్ల: మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎండిపోయిన నిద్ర గన్నేరు చెట్టు బుధవారం సాయంత్రం కూలింది. అయితే ఆ సమయంలో ఎలాంటి వాహనాలు, ప్రజలు సమీపంలో లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

పాఠశాలలో ఆడిటింగ్

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో బుధవారం పాఠశాల ఆడిటింగ్‌ను అధికారులు యువరాజు, నరసింహులు నిర్వహించారు. వచ్చిన నిధులు, వాటి ఖర్చులు తదితర వివరాలు సేకరించారు.

పర్వతారోహకుడికి అభినందన



విద్యార్థి సూర్యప్రసాద్, తల్లిదండ్రులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: మండలంలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కొడిగెనహళ్లికి చెందిన విద్యార్థి సూర్యప్రసాద్‌ను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. 5వ తరగతి చదువుతున్న సూర్యప్రసాద్ గతేడాది కిలీమంజారో పర్వతంతో పాటూ లడక్‌లోని దక్షిణ పుల్లు పర్వతాన్ని అధిరోహించాడు. దీంతో రాష్ట్రపతి ముర్మూ చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డునును అందుకున్నారు. అవార్డు తీసుకున్న తర్వాత తొలిసారి పాఠశాలకు రావడంతో సూర్యప్రసాద్‌ను సన్మానించారు.

అక్క చెల్లెమ్మలకు 'ఆసరా'

- నాలుగు విడతలుగా రుణమాఫీ
- బకాయి రుణాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- 'పురం' నియోజకవర్గంలో 4,244 సంఘాలకు రూ.125.84 కోట్ల లబ్ధి

హిందూపురం నియోజకవర్గంలో ఇలా..

మండలం	సంఘాల సంఖ్య	లబ్ధిదారులసంఖ్య	మొత్తం నగదు రూ..
'పురం' మున్సిపాలిటీ	1718	17,115	రూ.55.26 కోట్లు
హిందూపురం	890	9,172	రూ.25.28 కోట్లు
చిలమత్తూరు	976	9,047	రూ.28.90 కోట్లు
లేపాక్షి	660	6,619	రూ.16.40 కోట్లు
మొత్తం	4,244	41,953	రూ. 125.84 కోట్లు



హిందూపురం మున్సిపాలిటీలో సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు రుణమాఫీ చేసి అక్క చెల్లెమ్మలకు ఆసరాగా నిలిచి వారి జీవితాల్లోకి వెలుగులు నింపారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలోని 28,127 మహిళా సంఘాలకు మూడు విడతల్లో రూ.541.37 కోట్ల రుణ మాఫీ అయింది. చివరగా నాలుగవ విడతగా రూ.215.63 కోట్లు విడుదలయ్యాయి. ఈ లెక్కన మొత్తం రూ.863.67 కోట్లు మహిళా సంఘాల సభ్యుల అప్పులన్నీ తీరిపోయాయి. కాగా హిందూపురం నియోజకవర్గంలో సుమారు 3,354 మహిళా సంఘాలకు నాలుగువిడుతల్లో 125.84 కోట్లు రుణమాఫీ చేయడంలో అక్కచెల్లెమ్మల ఆనందం వెల్లివిరుస్తోంది. స్వయం సంఘాల ఉత్పాదకను మెరుగుపర్చడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వంలో బ్యాంకుల్లో బకాయి పడ్డా రుణాలు తిరిగి చెల్లించేందుకు వైఎస్ఆర్ ఆసరా పథకం దోహదపడుతోంది. 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో రుణాలను వైఎస్సార్‌సీపీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లించింది.

చాలా సంతోషంగా ఉంది



నేను పాడిని నమ్ముకొని నా కుటుంబానికి అండగా నిలిచాను. శ్రీసత్యసాయి బాబా మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉన్న నాకు వైఎస్సార్ ఆసరా కింద ఒక్కో విడతలో రూ.10 వేలు చొప్పున నాలుగు విడతలకు రూ.40 వేలు రుణమాఫీ అయింది. అలాగే మా సంఘం మొత్తం 10 మంది సభ్యులకు రూ.4 లక్షలు మాఫీ అయింది. జగనన్న అందించిన ఆసరాతో మా కుటుంబాలన్నీ సంతోషంగా ఉన్నాయి.

- జయమ్మ, కుర్లపల్లి, లేపాక్షి

మళ్లీ జగనన్నకే మద్దతు



జగనన్న ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆసరా పథకంతో ఎంతో మంచి చేసింది. డ్వాక్రా సంఘాల్లో అప్పుల్లో ఉన్న మాలాంటి వారికి జగనన్న ప్రభుత్వం చేయూత ఇచ్చింది. నాలుగు విడతల్లో రూ.5.32 లక్షలు అందించడంతో మా అప్పు అంతా తీరిపోయింది. మహిళలకు అండగా ఉన్న సీఎం జగనన్నకు మరోసారి మద్దతిస్తాం.

- రత్నమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు

రుణాలన్నీ మాఫీ



2019 నాటికి ఉన్న బ్యాంకు రుణాలన్నింటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాఫీ చేసింది. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో నాలుగో విడత ఆసరా డబ్బులు జమ అయ్యాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆసరా సంబరాలు ఊరూరా జరుగుతున్నాయి. రుణాలు మాఫీ కావడంతో మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



వెంకటరత్నమ్మను సన్మానిస్తున్న న్యాయమూర్తులు

హిందూపురం అర్బన్: అంకిత భావతంతో విధులు నిర్వహిస్తే తప్పక గుర్తింపు వస్తుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కోర్టు పర్యవేక్షణ అధికారిణి వెంకట రత్నమ్మ బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. బుధవారం ఫైర్‌స్టేషన్‌లో ఆయన్ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. నాగరాజు సేవలను కొనియాడారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న గిరిజమ్మ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో గిరిజమ్మను ఘనంగా సత్కరించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



2వవార్డులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ

హిందూపురం: రాష్ట్రంలో ఎన్నాడులేని విధంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ రహమత్‌బీ ఆధ్వర్యంలో మోడల్‌కాలనీలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికలు వస్తే తప్ప ప్రజలను కలిసే అవకాశం లేకపోయిందన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలకులే ఇంటి ముందుకు వచ్చి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని తెలుసుకొని పరిష్కరిస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రానున్న కాలంలో మరిన్ని కొత్త పథకాలను సీఎం జగన్ తేబోతున్నారన్నారు. హిందూపురంలో 30 ఏళ్ల గెలుస్తూ వచ్చిన టీడీపీ నాయకులు ఏం చేశారని ఒక్కసారి ఆలోచించాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా సరైన రోడ్లు, డ్రైనేజీలు వేయించలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన వెంటనే కరోనా ఇబ్బంది పెట్టినా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. మరోసారి జగనన్నకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేంద్రమ్మ, పట్టణ, మైనారిటీ కన్వీనర్ షాజహాన్, అయూబ్ బేగ్, మహిళా విభాగం కన్వీనర్ భాను తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ మంగమ్మ



కమ్మవారిపల్లిలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, చరణ్‌రెడ్డి

గోరంట్ల: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. కమ్మవారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సర్పంచ్ మణి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డితో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే నేరుగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. సచివాలయ పరిధిలోనే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిచడం కోసమే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ గ్రామాల్లో ఆత్మీయ పలకరింపు

మండలంలోని మండలపల్లి పంచాయతీ పరిధిలోని మేరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి పంచాయితీ పరిధిలోని యర్రయ్యగారిపల్లి, కమ్మవారిపల్లి, చొండూరివాండ్లపల్లి, ఎమకలగుట్టపల్లి గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చరణ్‌రెడ్డి ఆయా గ్రామల్లో ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అనంతరం యర్రయ్యగారిపల్లిలో చరణ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సొపట్ల మణి శుద్ధజల ప్లాంటును ప్రాంభించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



రైతులకు మోటార్లు, స్టార్టర్లు తదితర సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బీడు భూములు సాగులోకి తెచ్చేందుకు అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన మోటార్లు, స్టార్టర్లు, కేబుల్ వైరు తదితర సామాగ్రిని లబ్ధిదారులైన 12 మంది రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జలకళ కింద నియోజకవర్గంలో తొలి విడతలో మడకశిర నియోజకవర్గంలోనే ఉచితంగా అర్హులైన రైతులకు 150 బోర్లు వేసినట్లు చెప్పారు. దాదాపు 490 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని, దశల వారీగా బోర్లు మంజూరు చేయిస్తామన్నారు. రైతు పక్షపాతి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, గుడిబండ ఎంపీపీ రాధమ్మ, మడకశిర, అమరాపురం గుడిబండ సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, చిక్కన్న, చంద్రశేఖర్, అమరాపురం జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, అమరాపురం వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి



రొళ్ల: సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సాక్షిబృందం, మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఈర లక్కప్ప తెలిపారు. అగళి నుంచి మంత్రి పర్యటన ప్రారంభమై రొళ్ల, గుడిబండ, అమరాపురం, మడకశిరలో ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయడానికే మంత్రి పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల నాయకులు మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి నర్సేగౌడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మడకశిర వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుట్టకామప్ప, అగళి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, కుంచిటి వక్కలిగ రాష్ట్ర డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, సీనియర్ నాయకులు విజయరంగేగౌడు తదితరులతో కలసి బుధవారం అగళి, రొళ్ల, అమరాపురం మండలాల్లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటనకు సంబంధించిన వేదికలను పరిశీలించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతంపై స్థానిక నాయకులతో కలసి చర్చించారు.

రేపు అధికారులు హాజరుకండి

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 2న మధ్యాహ్నం 1:30 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులతో సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మండల అభివృద్ధిపై మంత్రి సమీక్షిస్తారని సచివాలయ ఉద్యోగులు, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులందరూ హాజరుకావాలని సూచించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

మడకశిర: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపైన ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మడకశిర రూరల్ మండలం, మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తదితర ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన విజయవంతంపై సమావేశంలో చర్చిస్తామన్నారు.


చనిపోయిన వారి పేర్లు తొలగించండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు ఇంకా ఉన్నాయని, అలాంటి వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని పలువురు రాజకీయ పార్టీల నాయకులు సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో సబ్‌కలెక్టర్ సమావేశమయ్యారు. చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు చర్యలు చేపడతామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

14వ వార్డులో ఆరోగ్య సురక్ష శిబిరం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: ప్రతి పేదవాడికి ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. 14వ వార్డులో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

చింత ఫలసాయం వేలం

అగళి: స్థానిక చెరువులో చేపలు పెంపకం, చింతతోపునకు బుధవార వేలం వేశారు. చింతతోపును రూ.75లకు హనుమంతరాయప్ప, చేపల పెంపకాన్ని నరసింహరాజు రూ.2.50 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు.

పనులు వేగవంతం చేయండి

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 పాఠశాలలో రెండో విడత కింద ప్రారంభమైన నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని పిల్లిగుండ్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాడు-నేడు ద్వారా నిర్మాణం దశలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. తర్వాత లక్కప్పనహళ్లి, అలుపనపల్లి తదితర పాఠశాలలను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

పౌర హక్కులపై అవగాహన

రొద్దం: ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతిగొప్ప వరం పౌర హక్కులని, వాటిని కాపాడి, ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ అధికారులపై ఉందని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొత్త ఎస్సీ కాలనిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

హిందూపురం అర్బన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మాజీ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డీబీ కాలనీలో ఉన్న బాలసదన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బహుమతులు అందజేశారు. న్యాయవాదులు సంతోషికుమారి, ఈశ్వరప్ప, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మద్దతు కోరిన సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప గొడనహళ్లి పంచాయతీలో పర్యటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజగౌడ్, సర్పంచ్ పుట్టమ్మ, ఎంపీటీసీ అదిలక్ష్మమ్మ, పలువురు నాయకులను కలిసి మద్దతు కోరారు.

వేలం పాట వాయిదా

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొడనహళ్లి గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన చింత ఫలసాయం వేలం పాటను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి సావిత్రి తెలిపారు. నిర్ణయించిన ధర కంటే తక్కువగా వ్యాపారస్తులు వేలం పాటపాడటంతో వేలాన్ని వాయిదా వేశామన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని ప్రిన్సిపాల్ ప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 2న శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లిలో బుధవారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. అలివేలమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.వడ్రహట్టి చెందిన హనుమంతు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామచంద్రుడు తెలిపారు. అతని వద్ద నుంచి 30 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

హిందూపురం: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ముద్దిరెడ్డిపల్లి, పట్టణంలోని హౌసింగ్‌బోర్డు గోవిందరాజులు, విద్యానగర్ రామకృష్ణ, మల్లికార్జునను అదుపులోకి తీసుకొని రూ.లక్షా 2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

7న మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7వ తేది మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పరిపాలనశాఖ అధికారి కేపీ.సుధీంద్రకుమార్ తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.